పనిచేయని నిఘా నేత్రం

- నిర్వహణ లేక నిరుపయోగంగా సీసీ కెమెరాలు
- నేర పరిశోధనలో కీలకపాత్ర
- పట్టింపులేని అధికారులు


కౌటాలలోని కుమురం భీం చౌరస్తాలో నిరుపయోగంగా సీసీ కెమెరా

కౌటాల: కౌటాలలో నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి. నిర్వహణ సరిగా లేక అలంకారప్రాయంగా మారాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారుల సహకారంతో మండల పోలీస్‌శాఖ అధికారులు నాలుగేళ్ల క్రితం మండల కేంద్రంలోని పలు కూడళ్ల వద్ద పది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాని వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రస్తుతం వాటిలో కొన్ని పని చేయడం లేదు.

ధ్వంసమవుతున్న సీసీ కెమెరాలు..

మండల కేంద్రంలో కోతుల బెడద తీవ్రంగా ఉండడంతో కోతులు సీసీ కెమెరాల తీగలను, సీసీ కెమెరాలను ధ్వంసం చేస్తున్నాయి.భారీ వాహనాల రాకపోకలతో వైర్లు తెగిపోయి సీసీ కెమెరాలు పని చేయడం లేదు. దీంతో సీసీ కెమెరాల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కౌటాలలో ఆర్టీసీ బస్టాండ్, ఎస్టీ కాలనీ, తలోడి చౌరస్తా వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయి. మిగతా కూడళ్ల వద్ద ఏర్పాటు చేయాల్సి ఉంది. మండల కేంద్రంలోని మొగడ్‌దగడ్ చౌరస్తాలో నాలుగు, మినీ స్టేడియం వద్ద రెండు, సదాశివపేట కాలనీలో రెండు, తలోడి పెట్రోల్ బ్యాంక్ ఏరియాలో రెండు, నదిమాబాద్ ఏరియాలో రెండు, విజయనగరం రోడ్డుకు రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. మరో 15 సీసీ కెమెరాలు కొత్తగా ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న పది సీసీ కెమెరాల నిర్వహణ చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యవేక్షణలో నిర్లక్ష్యం

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం .దీంతో వీటి ఏర్పాటుకు పోలీసులు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ పేరిట సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నా వాటి పర్యవేక్షణపై శ్రద్ధ కనబర్చడం లేదు. ఫలితంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడిన పోలీసులకు కొని సందర్భాల్లో నిందితులను పట్టుకోవడం కష్టమవుతోంది. మరికొన్ని సందర్భాల్లో సీసీటీవీలకు నిందితులు చిక్కినా కెమెరా నాణ్యత డొల్లతనంతో వారి ముఖాలు సరిగా కనిపించడం లేదు.

దొంగల భయం

ప్రశాంతంగా ఉండే కౌటాలలో దొంగలు విరుచుకు పడుతున్నారు. కౌటాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కూడా దొంగలు తమ చేతివాటం చూపుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కౌటాల శివాలయం, సాయిబాబా ఆలయాలతో పాటు పలువురి ఇళ్లల్లో దొంగలు పడ్డారు. దీంతో మండల వాసులు భయాందోళన చెందుతున్నారు.

కొత్త సీసీకెమెరాలు ఏర్పాటు చేస్తాం

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. కౌటాల పోలీస్ సర్కిల్‌లోని ప్రధాన కూడళ్లలో దాతల సహకారంతో గతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటిలో కొన్ని వినియోగంలో ఉన్నాయి. కోతుల బెడద, భారీ వర్షాల కారణంగా పలు సీసీ కెమెరాలు పని చేయడం లేదు. త్వరలో అన్ని ప్రధాన కూడళ్లలో కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– సాధిక్ పాషా, సీఐ, కౌటాల

కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


కార్మిక సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని భవన నిర్మాణ, ఇతర అసంఘటిత రంగాలలో పని చేస్తున్న కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కార్మిక శాఖ అధికారులు, కార్మికసంఘాల ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రంగాలలో పని చేస్తున్న అసంఘటిత కార్మికులు సుమారు 800 మందికి మే 1, 2, 3 తేదీల్లో 52 రకాల వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్మిక సంఘాల ప్రతినిధులు తమ సంఘంలోని ప్రతీ సభ్యుడికి అవగాహన కల్పించి శిబిరాలకు తీసుకురావాలన్నారు. కార్మికశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్మికుల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం తగు చర్యలు తీసుకోవాలని మే 1, 2 తేదీల్లో కాగజ్‌నగర్, 3వ తేదీన ఆసిఫాబాద్‌లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కార్మికశాఖ అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి


గోలేటిలో పర్యటిస్తున్న సీపీఐ నాయకులు

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్ అన్నారు. మంగళవారం సాయంత్రం గోలేటిలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి రాగానే వాటిని పూర్తిగా విస్మరించిందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఉపేందర్, పట్టణ కార్యదర్శి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సయ్య, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు రవికుమార్, నాయకులు పూదరి సాయి, పర్వతి సాయి తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ ప్రారంభం

కెరమెరి: మండలంలోని బాబేఝరి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం సర్పంచ్ మానిక్ రావు ప్రారంభించారు. గ్రామ పంచాయతీలోని ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, డీలర్ సుభాష్, హెచ్ఏ వసంత్ ఉన్నారు.

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో 2వ విడత కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ పెందూర్ పవన్ మంగళవారం ప్రారంభించారు. పంచాయతీ కేంద్రంలో 12 రోజుల పాటు శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ హివ్రె ప్రవీణ్ కుమార్, కార్యదర్శి పోషం, దేనవేణి గొల్ల పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూలీలందరూ పనికి రావాలి


ఉపాధి పనులు పరిశీలిస్తున్న అధికారులు

కెరమెరి: జాబ్‌కార్డు ఉన్న కూలీలు ఉపాధి పనులకు రావాలని ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సుదర్శన్ అన్నారు. మంగళవారం మండలంలోని సాంగ్వి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చేసిన పనులకు 15 రోజుల్లోనే కూలీ డబ్బులు వస్తాయని, ఎవరూ నిరుత్సాహపడకుండా పనులు చేయాలని పేర్కొన్నారు. అధిక పనులు చేస్తే అధిక డబ్బులు సంపాదించే అవకాశం ఉందన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 28వ తేదీన ఆసిఫాబాద్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశికళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి హాజరయ్యే సంబంధిత శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

సాండ్‌గాంలో భూసార పరీక్షలు


భూసార పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కౌటాల: మండలంలోని సాండ్‌గాం గ్రామంలో మంగళవారం ఆరీస్ ఆగ్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో సిబ్బంది భూసార పరీక్షలు చేశారు. భూసార పరీక్ష చేస్తేనే పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. భూసార పరీక్షలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రైతులు తప్పకుండా భూసార పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎకోన్‌కార్ దామోదర్, రైతులు ఉన్నారు.

‘నిరాధార ఆరోపణలు సరికాదు’


మాట్లాడుతున్న పోషక్క, కుటుంబసభ్యులు

రెబ్బెన: వారసత్వంగా వచ్చిన భూమిని తమకు తెలియకుండా పట్టా చేసుకోవటంతో పాటు న్యాయం చేయాలని చూసిన వారిపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని రోళ్లపాడు గ్రామానికి చెందిన బద్ది పోషక్క అన్నారు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి మండలకేంద్రంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. పులికుంట శివారులో తన తండ్రి పేరిట ఉన్న భూమిని ఆయన మరణానంతరం మేనత్త బత్తిని లక్ష్మీ దొంగతనంగా పట్టా చేసుకుందని, ఇరువైపులా న్యాయం చేయాలని చూసిన పెద్దమనుషులపై ఆరోపణలు చేస్తుందని విమర్శించారు. ఈవివాదంతో ఎలాంటి సంబంధం లేని పులికుంట సర్పంచ్ పోషమల్లు, తక్కళ్లపల్లి ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కొవ్వూరి శ్రీనివాస్, గ్రామస్తులు చింతపూరి శంకర్‌లపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం : విరూపాక్ష

కాగజ్‌నగర్

వెంకటరమణ : విరూపాక్ష

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	50
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
రతాళం	60
గోబి(పూల్)	80
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీ


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కాగజ్‌నగర్‌టౌన్: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాగజ్‌నగర్‌లో వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారాం నాయక్ ర్యాలీని ప్రారంభించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఖాజా, అనీసుద్దీన్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టి వీఓఏల నిరసన


కాగజ్‌నగర్‌టౌన్: నిరసన తెలుపుతున్న వీఓఏలు


కౌటాల: మద్దతు తెలుపుతున్న రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీఓఏలు కాగజ్‌నగర్‌లో చేపడుతున్న నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం 9వరోజు వీఓఏలు కళ్లకు గంతలు కట్టి నిరసన తెలిపారు. వీరికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ సంఘీభావం ప్రకటించారు. మద్దతు తెలిపిన వారిలో చందేకర్ జ్యోతి, ముంజమ్ ఆనంద్‌కుమార్ ఉన్నారు.

కౌటాల: ఐకేపీ వీఓఏల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు రావి శ్రీనివాస్ అన్నారు. వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం కొనసాగింది. సమ్మెకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావి శ్రీనివాస్ మద్దతు తెలిపారు. సమ్మెలో వీఓఏల సంఘం అధ్యక్షుడు వేంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు దత్తు, కాంగ్రెస్ పార్టీ నాయకులు విఠల్, శ్రీనివాస్, దేవయ్య పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

- కూలిన కల్వర్టు రెయిలింగ్
- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో వాహనదారులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు వెళ్లే దారిలో కల్వర్టుకు రెయిలింగ్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు పనుల నిమిత్తం మండలంలోని పలు గ్రామాల ప్రజలతో పాటు దహెగాం , పెంచికల్‌పేట్ మండలాలకు చెందిన ప్రజలు నిత్యం ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. అయితే దారిలోని కల్వర్టుకు రెయిలింగ్ లేకపోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

రద్దీ ఎక్కువ..

కల్వర్టుకు రెయిలింగ్ లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ట్రాక్టర్ కల్వర్టులో పడిపోయింది. ద్విచక్రవాహనం కూడా కల్వర్టులో పడిపోగా వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. కల్వర్టు నిర్మించే సమయంలో నాణ్యత పాటించకపోవడం వల్ల రెయిలింగ్ కూలిపోయిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మార్గం గుండా నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాస్పెల్లి గ్రామంలోని పెర్కవాడ, పెద్దవాడ రైతులకు చెందిన వాహనాలు పత్తి లోడ్‌తో ఈ మార్గం గుండా వెళ్తుంటాయి. రెయిలింగ్ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

ఎప్పుడేం జరుగుతుందో..



కల్వర్టుకు రెయిలింగ్ లేక బ్యాంకు పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో పాటు పెర్కవాడ గ్రామస్తులకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. కల్వర్టు వద్ద ఎప్పుడేం జరుగుతుందోనని భయంగా ఉంది.

- వార్ల కిరణ్, రాస్పెల్లి

అధికారులు స్పందించాలి



అధికారులు వెంటనే స్పందించి కల్వర్టుకు రెయిలింగ్ నిర్మించాలి. ఇప్పటికే కల్వర్టు వద్ద ప్రమాదాలు జరిగి ఆస్పత్రుల పాలైన సంఘటనలు ఉన్నాయి. ప్రయాణికులు భయందోళన చెందుతున్నారు.

- కుందారపు సుమన్, రాస్పెల్లి

ఘనంగా బీఆర్‌ఎస్ పార్టీ జెండా పండుగ


దహెగాం: పార్టీ జెండా ఎగురవేస్తున్న ప్రసాద్‌రాజు

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఇట్యాల, బీబ్రా, తదితర గ్రామాల్లో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ జెండా పండుగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగురవేశారు. జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, మండల రైతుబంధు సమితీ కన్వీనర్ సంతోష్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే హైమద్, నాయకులు శ్రీనివాస్, సంతోష్, నాగేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. అనంతరం ఆయా గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి తరలివెళ్లారు.

కెరమెరిలో..


కెరమెరి: జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ

కెరమెరి: మండలంలోని సాకడ, ఖైరీ, కెలికె, కెలిబి తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరించారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందోర్ ఆనంద్ రావు తదితరులు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో పార్టీ జెండా ఎగరవేశారు. గురడుపేట, గుడ్లబోరి, మొగడ్‌దగడ్, వీరవెల్లి, సాండ్‌గాం, తలోడి, వీర్దండి, ముత్తంపేట్ గ్రామాల్లో జెండాలు ఎగురవేశారు. పార్టీ మండలాధ్యక్షుడు వసంత్‌రావ్, ఎంపీపీ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బ్రహ్మయ్య, యూత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, వైస్‌ఎంపీపీ అమ్మక్క, సర్పంచులు మౌనిశ్, దామోదర్, సునంద, శంకరమ్మ, రేణుక, మాజీ ఎంపీపీలు గంగారం, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ మనీష్, శ్రీనివాస్, సంతోష్, హన్మంతు, గట్టయ్య, గోపాల్ పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్ ఆవిష్కరించారు. పీఏసీఎస్ చైర్మన్ జబోరే పెంటు, నాయకులు సదాశివ్, అసామ్, గంగుబాయి, అశోక్ మహోలకర్ పాల్గొన్నారు.

ఖిరిడిలో..

ఖిరిడి గ్రామంలో వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు సిడాం సకారాం బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. మండల కోఆప్షన్ సభ్యుడు బషరత్ ఖాన్, ఉప సర్పంచ్ అడ్డూరి రాజేష్, పార్టీ యూత్ అధ్యక్షుడు నరేందర్, వార్డ్ సభ్యుడు షౌకత్ అలీఖాన్, నాయకులు చిప్పకూర్తి దేవాజీ, జావిద్, జాహిద్ హుస్సేన్, పాషా, షకీల్, గంగాధర్, కేశవ్, మంజూర్ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: ఎన్నికలు ఏవైనా గెలిచేది బీఆర్‌ఎస్ పార్టీనే అని ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ హన్మండ్ల జగదీశ్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ ఉన్నారు.


తలోడిలో నిర్వహిస్తున్న ఆవిర్భావ వేడుకలు



వాంకిడి: జెండా ఆవిష్కరిస్తున్న అజయ్‌కుమార్


బెజ్జూర్: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా శంకరాచార్యుల జయంతి


పూజలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శిర్డీసాయి మందిరంలో మంగళవారం రాత్రి శంకర జయంతి, భగవత్‌రామానుజుల జయంతి ఘనంగా జరుపుకున్నారు. అర్చకులు ఇందారపు మధూకర శర్మ, సాయిశర్మ ఆధ్వర్యంలో శంకరాచార్యుల చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, సౌందర్య లహరి, శట్కం పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రమేశ్, వినోద్, దిలీప్, శంకర్, అశోక్, లక్ష్మయ్య, లచ్చన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజారంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

రెబ్బెన: తెలంగాణ గ్రామీణ బ్యాంకు గోలేటి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని రాజారంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ విశ్వప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్ సలుగు శ్రావణ్‌లు బ్యాంకు ద్వారా ఖాతాదారుల కోసం అమలు చేస్తున్న పథకాలు, అందజేస్తున్న రుణాల గురించి ప్రజలకు వివరించారు. క్యాషియర్ సురేష్, సిబ్బంది రాజు, జనార్దన్, ఐకేపీ సిబ్బంది రవి, కృష్ణ పాల్గొన్నారు.

భూమిపూజ

నార్నూర్: గాదిగూడ మండలం ఆద్మీయాన్ గ్రామంలో జంగుబాయి ఆలయ నిర్మాణానికి గ్రామ పటేల్ సీతారాం, కొరెంగా నాందేవ్ మంగళవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ జవాదే భారత్, మెస్రం చిన్ను గ్రామస్తులు ఉన్నారు.